క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



శౌరయ్యను పరామర్శిస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కేతేపల్లి: మండల కేంద్రానికి చెందిన జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య తండ్రి థామసయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శనివారం కేతేపల్లికి చేరుకుని శౌరయ్యను పరామర్శించారు. అనంతరం థామసయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు జనార్దన్‌రావు, లక్ష్మణ్‌రావు, కాల్వ శౌరయ్య, పసల రవి, జోజప్ప తదితరులు ఉన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి వేడుకలు



రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది

రామగిరి(నల్లగొండ): గ్రంథాలయోద్యమంలోని ప్రముఖుడు ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి వేడుకలు శనివారం జిల్లా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ, సిబ్బంది వేణుగోపాలచార్యులు, ఎస్. నర్సింహారెడ్డి, కట్ట నాగయ్య, ఎం. రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా రాజకుమారి



నియామక పత్రం అందజేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చండూరు: మండల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా తేలుకుంట్ల రాజకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా హైదరాబాద్‌లో ఆమె నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి వెంకన్న, దేవరకొండ రాధిక, గుంటి వెంకటేశం, కోఆప్షన్ సభ్యుడు రావిరాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



అనితకు నగదు అందజేస్తున్న పిల్లి రామరాజు

కనగల్: మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన రవీందర్ ఇటీవల క్యాన్సర్‌తో మృతిచెందాడు. కాగా ఆర్‌కేఎస్ టీం సభ్యుడు ఏటీల్లి క్రాంతి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా దాతలు అందజేసిన రూ.50,000తో పాటు ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు రూ.10,000 ఆర్థికసాయాన్ని శనివారం రవీందర్ భార్య అనితకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యేరేడ్ల సరస్వతీసుధాకర్‌రెడ్డి, యాదవ సంఘం మండలాధ్యక్షుడు జెట్టి శ్యాంసుందర్‌యాదవ్, కృష్ణయ్య, జయశంకర్, సైదులు, గోపాల్, పెద్దులు, శ్రీను, నర్సింహ, గణేశ్ తదితరులున్నారు.

బండపాలెంలో 'గడప గడపకు కాంగ్రెస్'



కాంగ్రెస్ అమలు చేయబోయే పథకాలను ప్రజలకు వివరిస్తున్న నలగాటి ప్రసన్నరాజ్

కేతేపల్లి: మండలంలోని బండపాలెంలో శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ గడప గడపకు తిరుగుతూ 'కేసీఆర్ హఠావో–తెలంగాణ బచావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను గ్రామస్తులకు వివరించారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన వంగూరి సాలయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాస్, బొంబాయి శ్రీను, వంటిపాక కిరణ్, వంగూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో పంటల సాగు

- వ్యవసాయ పనులకు చిన్న ట్రాక్టర్ల వినియోగం
- పదెకరాలకు పైగా భూమి ఉన్న రైతులు సొంతంగా కొనుగోలు
- ఉపాధి కోసం చిన్న ట్రాక్టర్లు కొనేందుకు ముందుకు వస్తున్న యువత

మునుగోడు: వ్యవసాయ పంటల సాగుకు రైతులు అధికంగా యంత్రాలనే వినియోగిస్తున్నారు. గతంలో ప్రతి రైతు పాడి, పశువులను పెంచి వాటిని తమ పొలాల దున్నకాలకు వినియోగించేవారు. ప్రస్తుతం ఎద్దులతో వ్యవసాయం చేసేవారి సంఖ్య తగ్గిపోతోంది. ప్రతి రైతు యంత్రాల వైపు చూస్తున్నారు. వ్యవసాయ పనులు చేసేందుకు అనువుగా ఉండే చిన్న ట్రాక్టర్లను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారు. అలా ఒక్కో గ్రామంలో నాలుగైదు చొప్పున ట్రాక్టర్లు ఉన్నా అవి రైతులకు సరిపోకపోవడంతో మరికొంత మంది ఈ ట్రాక్టర్లను కొనేందుకు ముందుకు వస్తున్నారు.

రోజుకు రూ. 5వేలకు పైగా ఆదాయం

మెట్ట పంటల సాగులో తమ పంట చేలకు కాంప్లెక్స్ ఎరువులు పెట్టేందుకు, గుంటుక తోలేందుకు రైతులు చిన్న ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. చిన్న ట్రాక్టర్లు కొనుగోలు చేసిన యువకులు, రైతులకు రోజుకు కనీసం రూ.5వేలు తగ్గకుండా ఆదాయం వస్తోంది. 10 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి కలిగిన రైతు సొంతానికి వాడుకునేందుకు రూ.7 లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతోపాటు ఒకటి, రెండు ఎకరాలు ఉన్న రైతులు ఈ ట్రాక్టర్లను కొనుగోలు చేసి తమ వ్యవసాయ భూమి పనులతో పాటు ఇతర రైతుల వ్యవసాయ పనులకు వెళ్లి ఎకరానికి రూ. 800లు తీసుకొని గుంటుక, గొర్రు తోలుతున్నారు. గతేడాది మండల వ్యాప్తంగా 50 లోపు ఉన్న చిన్న ట్రాక్టర్ల సంఖ్య ఈ ఏడాది దాదాపు 300లకు పైగా చేరిందని రైతులు చెబుతున్నారు.



చీకటిమామిడిలో చిన్న ట్రాక్టర్‌తో పత్తి చేనుకు కాంప్లెక్స్ ఎరువులు పెడుతున్న యువకుడు

ఒక్కరోజులో పని పూర్తవుతుంది



గతంలో ఎద్దుల అరకతో వ్యవసాయం చేస్తే రోజుకు రెండు, మూడు ఎకరాల చొప్పున గుంటుక లేదా గొర్రు తోలితే 10 ఎకరాలకు ఐదు రోజులు పట్టేది. కానీ చిన్న ట్రాక్టర్లతో తోలితే ఒకే రోజులో పని పూర్తవుతుంది. డబ్బుఖర్చయినా పని మాత్రం తొందరగా అవుతుంది.

– తిరిపారి గోవర్ధన్, రైతు, ఎల్లగూడెం

ఆదాయం బాగుంది

నేను ఐటీఐ చేశాను. ఉద్యోగం లభించకపోవడంతో గతేడాది రూ.5 లక్షలు పెట్టి చిన్న ట్రాక్టర్ కొనుగోలు చేసి ఇతర రైతుల వ్యవసాయ పనులకు కిరాయికి వెళ్తున్నాను. గుంటుక, లేదా గొర్రు తోలినందుకు ఎకరానికి రూ. 800ల చొప్పున పది ఎకరాలకు రూ. 8వేల ఆదాయం వస్తోంది. డీజిల్‌కు రూ.3వేలు పోను రూ.5వేలు మిగులుతున్నాయి.

– బక్క నిరంజన్, చీకటిమామిడి

పనులు త్వరగా పూర్తి చేయాలి



నకిరేకల్: 100 పడకల ఆస్పత్రి స్లాబ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: నకిరేకల్‌లో చేపట్టిన 100 పడకల వైద్యశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన వైద్యశాల పనులను పరిశీలించారు. ఆయన వెంట నడికుడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

మరో 7 సబ్‌సెంటర్లకు నిధులు మంజూరు..

నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి, మంగళపల్లి, నోముల, రామన్నపేట మండలంలోని సిరిపురం, లక్ష్మాపురం, రామన్నపేట, వెల్లంకి గ్రామాల్లో మరో 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సబ్‌సెంటర్ల భవన నిర్మాణాలకు రూ.20లక్షల చొప్పున రూ.1.40 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వెల్లడించారు. ఇటీవలే 12 హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని గుర్తుచేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.



కట్టంగూర్: ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన చెర్వుఅన్నారం గ్రామస్తులు

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక

కట్టంగూర్: మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో మక్కా సైదులు, అద్దెంకి వెంకన్న, అద్దంకి శ్రీను, గోలి శంకర్, దాసరి రామస్వామి, రామకృష్ణ, అశోక్, శంకర్, వెంకన్న ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, గుండగోని రాములు తదితరులు పాల్గొన్నారు.

'గుత్తా'కు రేషన్ డీలర్ల కృతజ్ఞతలు



గుత్తా సుఖేందర్‌రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్: కేసీఆర్ ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి నెరవేర్చినందుకు గాను రేషన్ డీలర్ల సంఘం నాయకులు శనివారం నల్లగొండలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. 90లక్షల మందికి రేషన్ సరుకులు సరఫరా చేస్తున్న డీలర్ల కమీషన్‌ను ప్రభుత్వం భారీగా పెంచిందని తెలిపారు. మెట్రిక్ టన్నుకు రూ.200 ఉన్న కమీషన్‌ను రూ.1400 పెంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పొరెపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్

చిట్యాల: గ్రూపు–2 పరీక్షను వాయిదా వేయాలని హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం ముందు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన శాంతియుత సత్యాగ్రహ దీక్షకు వెళ్తున్న చిట్యాల పట్టణానికి చెందిన పలువురు బీఎస్పీ నాయకులు పోలీసులు శనివారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బీఎస్పీ మండల అధ్యక్షుడు గ్యార శేఖర్, జిల్లా నాయకులు గ్యార మారయ్య, జిట్ట నర్సింగరాజు తదితరులు ఉన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు వెళ్తున్న మండల బీఎస్పీ నాయకులను శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య, నాయకులు పల్లేటి రవీందర్, గ్యార వెంకటేష్ ఉన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి: మండల బీఎస్పీ నాయకులను శనివారం నార్కట్‌పల్లి పోలీసులు ముందుస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఆ పార్టీ ఇన్‌చార్జి ఆదిమల్ల గోవర్ధన్, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి ప్రియదర్శిని, నకిరేకల్ మండల మహిళా కన్వీనర్ మర్రి శోభా, నార్కట్‌పల్లి, రామన్నపేట, చిట్యాల మండల పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శాంతికుమార్, మేడి సంతోష్, గ్యార శేఖర్ తదితరులు ఉన్నారు. పాల్గొన్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: సత్యాగ్రహ దీక్షకు వెళ్ళకుండా బీఎస్పీ మండల నాయకులను శనివారం ఉదయం పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. అరెస్టయిన వారిలో నాయకులు కారుపాటి అంబేద్కర్, మందుల అజయ్‌కుమార్, సిరుపంగి సాయికుమార్, ఓగోటి లవకుమార్, కోక నాగశివ తదితరులు ఉన్నారు.



నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన బీఎస్పీ నాయకులు

నల్లగొండలో ధర్నా..

నల్లగొండ టౌన్: గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ స్వేరోస్ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ఇదే విషయమై సత్యాగ్రహ దీక్ష చేపట్టిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయం సమంజసం కాదని, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పరిహారం చెల్లింపులో అన్యాయం

మర్రిగూడ: శివన్నగూడ, కిష్టరాయనపల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గ్రామాల భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సాయిబండాతండా, కుదాభక్షపల్లి, వెంకేపల్లితండా, వెంకేపల్లి, రాజాపేటతండా, రాంరెడ్డిపల్లి, సరంపేట గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భూనిర్వాసితులకు, ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లిస్తామన్నారు. ఏ గ్రామంలో చూసినా మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క తిరుపతయ్య, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్నేని అనిత, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లెం జైపాల్‌రెడ్డి, ఆదివాసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీను నాయక్, బేత వెంకటేష్‌యాదవ్, మేకల నర్సింహారెడ్డి, సిరిపంగి శ్రీనివాస్, మాదగోని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకేపల్లి తండాలో గిరిజనులతో మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

అల్పాహారం అందించడం అభినందనీయం



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అల్పాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్: మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నల్లగొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు నిత్యం ఉచితంగా అల్పాహారం అందించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గట్టుపల్లి రమ్య పుట్టినరోజు సందర్భంగా రోగుల సహాయకులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగిని భీమయ్య, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, గోలి అమరేందర్‌రెడ్డి, యారాల ప్రభాకర్‌రెడ్డి, గట్టుపల్లి రవీందర్ రెడ్డి, కోడె సతీష్, డాక్టర్ పుల్లారావు, సింహాద్రి, తుమ్మలూరి మురళీధర్‌రెడ్డి, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, పుట్ట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలి

నల్లగొండ: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి యూత్ కాంగ్రెస్ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ నల్గొండ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రవి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి యూత్ కాంగ్రెస్ డిక్లరేషన్ వివరించినట్లు తెలిపారు. నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హయాంలోనే అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నల్లగొండ మండల అధ్యక్షుడు కొప్పు నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షులతో కాంగ్రెస్ నాయకులు

వ్యక్తిగత విమర్శలు చేయడం తగదు

మర్రిగూడ: తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీటీసీలు తనపై విమర్శలు బాధాకరమన్నారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ఒకవేళ ఏమైనా ఆధారాలు ఉంటే రాజీనామా చేయడానికి సిద్ధమన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మర్రిగూడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏఈఓలు ట్రక్ షీట్లపై సంతకాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. లెంకలపల్లిలో వీధి దీపాలు వెలగకపోవడం, రాజాపేటతండాలో అంగన్‌వాడీ టీచర్ లేకపోవడం, బట్లపల్లి, రాజాపేటతండాలో నూతన రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని, మర్రిగూడలో భూమి లేని వారికి పాసుపుస్తకాలు ఉన్నాయని, పాసుపుస్తకాలు ఉన్నవారికి భూములు లేవని ఆయా గ్రామాల సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అంతకుముందు మహిళా ఎంపీటీసీలను అభివృద్ధి కార్యక్రమాలకు పిలవడం లేదని తమ్మడపల్లి ఎంపీటీసీ, రూ.36లక్షల నిధులు ఎంపీపీ గ్రామానికే వెచ్చించారని అంతంపేట ఎంపీటీసీతో పాటు దామెరభీమనపల్లి, మర్రిగూడ, రాంరెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యులు సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్లారు. సమావేశంలో తహసీల్దార్ ఎం. మహేందర్ రెడ్డి, ఎంపీడీఓ జె. వెంకటేశ్వర్‌రావు, వైద్యులు తరుణ్, ఏఈలు వెంకటేశ్వర్లు, యశ్వంత్, రాజేష్, ఏఓ స్పందన, హెచ్ఓ శ్వేత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మిర్యాల పద్మ, ముమ్మడి యశోద, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి

ఘనంగా ఏకాదశి యజ్ఞం

కట్టంగూర్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ఆలయ పూజారి రామడుగు శ్రీనివాసశర్మ, శిరీష దంపతుల ఆధ్వర్యంలో శనివారం చతుర్థ ఏకాదశి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి సైదులు, మీలా వేణుమాధవ్, బండారు అరుణ్, పావని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ల వినూత్న నిరసన

నల్లంగొడ టౌన్: నల్లగొండ పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు శనివారం మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలియజేశారు. అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, లేదంటే తమకు చావే శరణ్యమని అన్నారు. కార్యక్రమంలో దండెంపల్లి సత్తయ్య, పాలె సత్యనారాయణ, నర్సింహగౌడ్, ఎండీ సత్తార్, పి. ఎల్లయ్య, ఎండీ అనీఫ్, కె. యాదగిరి, పూలమ్మ, ఎం. నాగయ్య, లింగయ్య, దేవి, కోటయ్య, వెంకటనారాయణ, స్వామి, కృష్ణయ్య, కృష్ణవేణి, లింగమ్మ పాల్గొన్నారు.



మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న స్వీపర్లు

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నకిరేకల్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వస్తి పుణ్యావాచనం, విశ్వక్సేన పూజ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి కల్యాణం జరగనుంది. ఈ కార్యక్రమంలో వేద పండితులు శ్రీమాన్ కోమాండూరి శ్రీనివాసాచార్యులు, ఆలయ చైర్‌పర్సన్ కందాల శోభారాణిశ్రీనివాస్‌రెడ్డి, ధర్మకర్తలు సోమ సుధాకర్, పెండెం అంజనేయులు, గిద్దె అంజయ్య, ఎరుకుల లక్ష్మి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేతేపల్లి: మండల కేంద్రంలో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్న కారణంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ గాబ్రియేల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టూటౌన్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉదయం 10.00గంటలకు హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ దగ్గర గల కొత్త కాపు యాదవరెడ్డి గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పులి లక్ష్మయ్య, రాష్ట్ర నాయకుడు గాదెపాక లింగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

నకిరేకల్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు యానాల కృష్ణారెడ్డి, అధ్యక్షుడు చాపల అంజిరెడ్డి, కార్యదర్శి పట్టే కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మహలక్ష్మి కంటి ఆస్పత్రి వారిచే ఈ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

మర్రిగూడ: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన గొర్రెల యూనిట్లను రైతుబంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ శనివారం మండల కేంద్రంలో పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమలు అభ్యున్నతి కోసం గొర్రెల పంపిణీ చేస్తోందని అన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రామిడి వెంకటరమణరెడ్డి, బండా రమేష్, కాట వెంకటయ్య, రాపోలు యాదగిరి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్వీ నాయకుల సంబరాలు

నల్లగొండ టూటౌన్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ అనుమతులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్వీ నాయకులు శనివారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ వద్ద టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, అరవింద్, లింగం, ఏమిరెడ్డి విజయేందర్‌రెడ్డి, ఏడుకొండలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను తొలగించిన రైతులు

శాలిగౌరారం: రామన్నపేట మండలంలోని తుర్కపల్లి వద్ద శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే రాచ కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను శాలిగౌరారం మండలంలోని జాలోనిగూడెం గ్రామానికి చెందిన రైతులు శనివారం టీటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల వెంకటరమణారెడ్డి నేతృత్వంలో తొలగించారు. శ్రమదానంలో రైతులు జోగు అరవింద్, జమ్ము సతీష్, కడారి వినోద్, కల్లూరి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలపై సర్వే

నకిరేకల్: పట్టనంలోని 100 పడకల ఆస్పత్రిలో శనివారం పీవైఎల్, పీఓఎల్ ఆధ్వర్యంలో వసతులు, ఇతర సమస్యలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బీవీ చారి, మామిడోజు వెంకటేశ్వర్లు, చెరుకు సైదులు, నగేష్ చిరంజీవి, సురేష్ తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి

మర్రిగూడ: రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. 9 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఇప్పటివరకు ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని ఆరోపించారు. రేషన్ కార్డులు లేకపోవడంతో నిరుపేదలు ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండవ ఏఎన్‌ఎంల ధర్నా

నల్లగొండ టౌన్: గత పదహారు సంవత్సరాలుగా వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రెండవ ఏఎన్‌ఎంలు శనివారం నల్లగొండ పట్టణంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ఖాళీ గిన్నెలతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో లెనిన్, బి. నాగమణి, అండాలు, వసంత, అలివేలు, సులోచన, గీత, అరుణ, సుప్రియ, వరలక్ష్మి, అనిత, రేణుక, భవాని, సంతోష పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ ఎన్నిక

కట్టంగూర్: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన టీడీపీ మండల సమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బూరుగు తిరుమలేష్, ఉపాధ్యక్షులుగా దెందె సైదులు, మాంద్ర అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీపాద నందకుమార్, కార్యదర్శులు గోపగోని వెంకన్న, గాజుల భిక్షం, నిమ్మనగోటి యాదయ్య, కోశాధికారిగా నిమ్మనగోటి సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య, భువనగిరి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నూకల శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గద్దపాటి వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి నక్క రాంబాబేష్ ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గజవెల్లి సత్యం, యాదా వాసుదేవ్, అంజనేయులు, ఎం. క్రిష్ణయ్య, జెల్లా పుల్లయ్య, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

నల్లగొండ టౌన్: ఐకేపీ వీఓఏలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో శరత్, సులోచన, సువర్ణ, లక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు

నకిరేకల్: నకిరేకల్‌లో శనివారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) కార్యాలయంలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి. వెంకటేశం, తక్కళ్లపల్లి వెంకటేశ్వర్లు, నాగయ్య, పోతుల భూపాల్, గోపాల్, నరసింహచారి, వెంకటేశ్వర్లు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చైతన్యం చేయాలి

నల్లగొండ టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రజలను చైతన్యం చేయాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నాగార్జున, శంకర్, ఐలయ్య, ముత్యాలు, అంజమ్మ, యాదగిరి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన అంబులెన్స్ డ్రైవర్ చిన్నం మల్లేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి మాతృదేవోభవ–పితృదేవోభవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నవీన్ శనివారం వంద కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

చండూరు: మండల కేంద్రంలో ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేశ్ ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇరిగి ప్రవీణ్, మండల కార్యదర్శి పరమేష్, గడ్డం నవీన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.